క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప ఆలయంలో అర్చకుడు తివారి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో అజ్మీర స్పందన కార్తీక్, అక్కపెల్లి రమాదేవి, సాంబయ్య, శ్రావణ్, మాలోతు విజయ వెంకటేశ్వర్లు, బస్వ సాయి, సందీప్, భానోతు శ్రీలత, వెంకన్న, గౌతమ్ పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, పిన్నా రామనాథం, బండారుపల్లి చెంచారావు, ఆకుల ప్రభాకర్ పాల్గొన్నారు.

మాధన్నపేట చెరువుకు గంగా హారతి



నర్సంపేట రూరల్ : కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువుపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట చెరువులో గంగాహారతి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీ మాతంగి రాజశ్యామల చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపారాధన, 6.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, 7.20కి గంగా హారతి కార్యక్రమాన్ని మహాభాగల్ అఘోర తంత్రి బ్రహ్మశ్రీ వెన్నంపల్లి నిషాంత్ శర్మ అవదాని, అయ్యప్ప ఆలయ ప్రధాన అర్చకుడు దేవేశ్ మిశ్రా, మాధన్నపేట ఆలయ ప్రధాన అర్చకుడు సతీశ్ తివారీ నిర్వహించారు.

సిద్ధేశ్వరాలయంలో..



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో భక్తులు సోమవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బీఎం.శాస్త్రి, సాయి శాస్త్రి, గణేశ్ శాస్త్రి అర్చన చేయించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అదనంగా రెండు సీట్లు కేటాయించాలి



వర్ధన్నపేట : ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు రిజర్వ్‌డ్‌గా ఉన్న సీటుకు అదనంగా రెండు సీట్లు కేటాయించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులు చీరలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం రాజేశ్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని, వికలాంగులపై ఆధిపత్యం చేలాయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షరీఫ్, నాయకులు కొల్లూరి ఈదయ్య బాబు, గుడిపెల్లి సుమతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీ జిల్లా కార్యవర్గ పరివేక్షణలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండ కార్తీక్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఇరుకుల్ల రవి, కోశాధికారిగా తడక రాజు గౌడ్, ఉపాధ్యక్షుడుగా అలువాల శ్రీనివాస్, ముఖ్య సలహాదారుగా రామగిరి లక్ష్మి, గౌరవ అధ్యక్షుడుగా పుట్ట రాజు, కార్యవర్గ సభ్యులుగా అంబాల భిక్షపతి, కొక్కు రాంనరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు దొంతి సంతోశ్, అమ్మ రాజు, ఎగ్గడి రాజు, బాషబోయిన మహేశ్, మూడు ఫేమ్ నాయక్, భూక్య జీవన్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా..

పర్వతగిరి : వరంగల్ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఏనుగల్‌కు చెందిన గూడ నరేందర్ వర్మ, ఈసీ సభ్యుడిగా కోలా పార్థసారధి ఎన్నికయ్యారు. అనంతరం నరేందర్, పార్థసారథిలను కార్యవర్గం సత్కరించి అభినందించింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌కు నరేందర్, పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన ధాన్యానికే టోకెన్

- కొనుగోలులో నిబంధనలు కఠినం
- రైతులకు తప్పని తిప్పలు

ఖానాపురం : అష్టకష్టాలు పడి పంటలు సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ నిబంధనలు కఠినతరం చేయడంతో ధాన్యం కొనుగోలులో ఆటంకాలు ఎదురవుతున్నాయి. మండలంలో ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాని దుస్థితి నెలకొంది.

పాకాల ఆయకట్టు కింద ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలో రైతులు ఖరీఫ్ సుమారు 29 వేల 500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే వరి కోతలు ముమ్మరం అయ్యాయి. యంత్రాల సహకారంతో రైతులు వరి కోస్తున్నారు. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో 8, చెన్నారావుపేట సొసైటీ ఆధ్వర్యంలో 3, రైతుమిత్ర సంఘాల ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాగా సదరు కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయలేదు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ఎదురుచూస్తున్న పరిస్థితి కనపడుతోంది. తేమ 17 శాతంలోపు వచ్చిన రైతులు అనేక మంది ఉన్నా ఎవరికీ ఏఈఓలు టోకెన్ ఇవ్వలేదు. ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసిందంటూ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రాగంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులు

శుభ్రం చేసిన ధాన్యానికే టోకెన్

ధాన్యంలో తాలు, మట్టి, రాళ్లు, పాడైపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతానికి తక్కువగా ఉండాలని, పరిపక్వం కాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతానికి మించొద్దని అధికారులు తెలిపారు. నిబంధనలు పాటించకపోతే టోకెన్ ఇచ్చే పరిస్థితి లేదని ఏఈఓలు తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించే పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు. ఈ క్రమంలో మండలంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు మొదలు కాలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి.

నాణ్యత ఉంటేనే టోకెన్



ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తున్నాం. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే టోకెన్ ఇస్తాం. ధాన్యాన్ని శుభ్రం చేయకుండా తీసుకొస్తే టోకెన్ ఇచ్చే పరిస్థితి లేదు. రైతులు ధాన్యాన్ని శుభ్రపర్చకపోవడం వల్లే ఇప్పటి వరకు టోకెన్లు ఇవ్వలేదు. శుభ్రం చేసుకున్న రైతులకు టోకెన్ ఇస్తాం.

\- బోగ శ్రీనివాస్, ఏఓ

వ్యాయామం, యోగాతో ఆరోగ్యం

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయుడు



మాట్లాడుతున్న డాక్టర్ జయుడు

నర్సంపేట : ప్రతిరోజూ వ్యాయామం, యోగా చేయడం ద్వారానే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని వీఎన్ఆర్ నర్సింగ్ హోం నిర్వాహకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వి.ఎం.జయుడు స్పష్టం చేశారు. వరంగల్ రోడ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీఎన్ఆర్ నర్సింగ్ హోంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎల్ఐపీఈ, డీపీఆర్ఓ, సీబీపీ, స్కానింగ్, తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయుడు మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం ఆహార నియమాలు పాటించాలని సూచించారు. రోజూ వాకింగ్, వ్యాయామం తోపాటు యోగాసనాలు వేయాలని చెప్పారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్ మాట్లాడారు. సామాజిక బాధ్యతలో భాగంగా డిసెంబర్ 1న ఎయిడ్స్ డే దినోత్సవం సందర్భంగా మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రవికృష్ణ, మోతె ఇంద్రసేనారెడ్డి, పెండెం భాస్కర్, శ్రీకాంత్, వీరారెడ్డి, వెంకన్న, సురేశ్, శ్రీనివాస్, పెండెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

- ఏఓ శ్రీనివాస్

ఖానాపురం : రైతులు నాణ్యమైన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏఓ శ్రీనివాస్ మాట్లాడారు. ధాన్యం విక్రయంలో అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. తేమ శాతం 17కు తక్కువగా ఉండేలా చూసి తీసుకురావాలని చెప్పారు. మట్టి పెళ్లలు, రాళ్లు లేకుండా చూడాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం సూచనలతో కూడిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాస్



నెక్కొండ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ హరీశ్‌రెడ్డి



కొనుగోలులో మోసపూరిత విధానాలు



ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

- సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు మల్లేశం

నర్సంపేట : ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో మోసపూరిత విధానాలు అవలంభిస్తోందని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు మోడెం మల్లేశం తెలిపారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ గేట్ ఎదుట రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. అనేక అవరోధాలను ఎదుర్కొని పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తుండగా అధికారులు, నిర్వాహకులు అనేక కొర్రీలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, డస్టు, తదితరాల పేరుతో బస్తాకు 3 కేజీలు కోత పెట్టేందుకు అంగీకరిస్తేనే కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బహిరంగంగా చెబుతుండడం అక్రమాలు తారాస్థాయికి చేరుకున్నాయనడానికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. రైతులు చలిలో వణుకుతూ ధాన్యం కొనుగోలుకు ఎదురు చూస్తుండగా నిబంధనల పేరుతో టోకెన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, కొందరు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మోసపూరిత విధానాలతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి వస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ధర్నాను విరమించేది లేదంటూ నాయకులు, రైతులు భీష్మించడంతో తహసీల్దార్ చర్చలు జరిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, వ్యవసాయ శాఖ అధికారులను పిలిపించి మాట్లాడి రైతులకు టోకెన్లు ఇప్పించి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు ఎడ్ల ప్రతాప్‌రెడ్డి, వెంకన్న, రమేశ్, పూలక్క, పద్మ, అరుణ, విజయ, రాజన్న, రవి, రాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సాక్షి నెట్‌వర్క్ : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, రావుల హరీశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లోని మేడపల్లి, రాంపూర్, గోవిందాపూర్, కన్నారావుపేట, అర్శనపల్లి, రంగాపురం, ముచ్చింపుల, నాగరాజుపల్లి, గుండ్లపహాడ్, మైసంపల్లి, ముద్దునూరు, బొబ్బరోనిపల్లి, లక్ష్మిపురం, దేశాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాలాయి శ్రీనివాస్ ప్రారంభించారు. అలాగే నెక్కొండ మండలంలోని నాగారంలో చైర్మన్ హరీశ్‌రెడ్డి, ఖానాపురం మండల కేంద్రంలో పాకాల రైతుమిత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, రాయపర్తి మండలంలోని గన్నారంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సన్నధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తోందని, మద్దతు ధర లభిస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు.



రాయపర్తి : ప్రారంభిస్తున్న హామ్యానాయక్



ఖానాపురం : ప్రారంభిస్తున్న హరిబాబు

మహిళల భద్రత సామాజిక బాధ్యత

- ప్రముఖ రచయిత్రి, సామాజికవేత్త రజిత

వర్ధన్నపేట : మహిళల భద్రతను సామాజిక బాధ్యతగా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ రచయిత్రి, సామాజికవేత్త అనిశెట్టి రజిత అభివర్ణించారు. మహిళలపై హింస వ్యతిరేక దినం సందర్భంగా మండల కేంద్రంలోని భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన 'వైట్ రిబ్బన్ డే' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు గడుస్తున్నా, దేశం శాస్త్రసాంకేతిక రంగాల్లోనూ దూసుకుపోతున్నా మహిళలపై అరాచకాలు కొనసాగుతుండడం బాధాకరమన్నారు. మహిళలపై హింసను సమాజంలోని కొందరు వ్యక్తుల్లోని రుగ్మతగా తెలిపారు. మహిళలు, బాలికలపై దుర్మార్గాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపైనా ఉందన్నారు. మహిళలు అనేక అవరోధాలను ఎదుర్కొని ప్రపంచం గర్వించే స్థాయికి ఎదుగుతున్న తరుణంలోనే ఇంకా లింగ వివక్ష కొనసాగుతుండడం సరికాదని చెప్పారు. మహిళల హక్కుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ మహిళలు హక్కులను సరైన విధంగా వినియోగించుకోగలిగితే వారి సంక్షేమానికి ఢోకా ఉండదన్నారు. మహిళలు గళమెత్తితేనే సమానత్వం సాధించగలరని స్పష్టం చేశారు. డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్ఫూర్తినిచేలా, వారి హక్కులను కాపాడేలా హింసను నిర్మూలించే దిశగా ఏటా నవంబర్ 25న కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వర్ధన్నపేట సీడీపీఓ డోబోరా మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళల హక్కులు, సంక్షేమం కోసం పని చేస్తామని, హింసను వ్యతిరేకిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ లలిత, సువర్ణ, నీరజ, మాధవీలత, సర్వోదయ ఆర్గనైజేషన్ ఉద్యోగి ఇందిర, ఫీల్డ్ ఆఫీసర్లు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బందెలదొడ్డి స్థల వివాదంపై విచారణ



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన బందెలదొడ్డి స్థల వివాదంపై డీఎల్‌పీఓ వేదవతి సోమవారం విచారణ చేపట్టారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా పూర్వం నుంచి బందెలదొడ్డి ఉండేదంటూ గ్రామానికి చెందిన వల్లందాస్ కుమార్, పట్టాపురం రాజు, అలుగునూరి రాజు, బండి రాజు, తదితరులు డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బి.సునీల్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్‌లోని గొర్రెకుంట క్రాస్ వద్ద పాన్ షాపు నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్న మహిళ పట్ల తొగరి శ్రీనివాస్, అతడి స్నేహితులు ఆదివారం రాత్రి దౌర్జన్యం చేశారు. అసభ్య పదజాలతో దూషిస్తూ సెల్‌ఫోన్లలో వీడియో తీస్తూ చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మహేందర్ మీడియాకు వెల్లడించారు.

గంజాయి పట్టివేత

నర్సంపేట రూరల్ : గంజాయిని తరలిస్తుండగా నర్సంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'సాక్షి'కి అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. నర్సంపేట–మహబూబాబాద్ జాతీయ రహదారి మీదుగా నర్సంపేట పట్టణ శివారులోని ద్వారకపేట బైపాస్ రోడ్డు వైపు ఓ వాహనంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు అందగానే వెల్లడిస్తామని చెప్పారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

- స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్టళ్లలో అధికారుల తనిఖీ



చెన్నారావుపేట : అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి బాలకృష్ణ

సాక్షి నెట్‌వర్క్ : స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెన్నారావుపేట, సంగెం, పర్వతగిరి, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లోని పలు ప్రభుత్వ స్కూళ్లలో, హాస్టళ్లలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్లు గనిపాక రాజ్‌కుమార్, రవిచంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, ఎంపీడీఓలు కాసర్ల రవీందర్, శంకర్ నాయక్, లెక్కల అరుంధతి సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, సరుకుల రికార్డులను, పరిసరాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిర్వాహకులు శుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కోరారు.

డేటా ఎంట్రీలో తప్పులుండొద్దు

- ఎంపీడీఓ కాసర్ల రవీందర్

సంగెం : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే డేటా ఎంట్రీలో తప్పులుండొద్దని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల పరిధిలో 17 వేల 290 కుటుంబాలుండగా ఇప్పటివరకు 17 వేల 12 కుటుంబాల సర్వే పూర్తి అయ్యిందన్నారు. మిగతా కుటుంబాల సమాచారాన్ని సంబంధిత ఎన్యుమరేటర్లకు అందించాలని ప్రజలను కోరారు. కార్యాలయంలో 20 కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 182 కుటుంబాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశామన్నారు. ఆపరేటర్లు అప్రమత్తంగా ఉంటూ సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, సూపరింటెండెంట్ ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి

సంగెం : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధించగలరని లీడ్ బ్యాంక్ కౌన్సిలర్ భాస్కరాచారి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు తప్పనిసరిగా బ్యాంకులో ఖాతా కలిగి ఉండడంతోపాటు ప్రతినెలా పొదుపు చేయడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలతో సామాజిక భద్రత లభిస్తుందని చెప్పారు. బ్యాంకుల్లో సేవింగ్‌తోపాటు రికరింగ్, కరెంట్, టర్మ్ డిపాజిట్ అకౌంట్ తెరిచే విధానాన్ని వివరించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే బాధితులు వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్, గ్రామీణ వికాస్ బ్యాంకుల ఆర్‌డీఓలు గోవింద్, విష్ణు, ఏపీఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- రూరల్ సీఐ సాయి రమణ



మాట్లాడుతున్న సీఐ సాయి రమణ

నల్లబెల్లి : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట రూరల్ సీఐ సాయి రమణ కోరారు. మండలంలోని రాంతీర్థంలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కళాజాత కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. నేరాల నివారణలో పోలీసులకు యువత సహకరించాలని కోరారు. తొలుత కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, అక్షరాస్యత, డయల్ 100, సీసీ కెమెరాలతో ఉపయోగాలు, చైన్ స్నాచింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మారెడ్డి, కళాబృందం ఇన్‌చార్జ్, ఏఎస్ఐ నాగమణి, హెడ్‌కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రత్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి'

దుగ్గొండి : తెలంగాణ ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కవుల కళాకారుల ఫోరం జిల్లా కన్వీనర్ శింగనబోయిన లింగయ్య కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారులకు, కళాకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని చెప్పారు. ఈనెల 27, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి వేములవాడకు తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫోరం మండల అధ్యక్షుడు ఆరె జైపాల్‌రెడ్డి, నాయకులు మేర్గు రాంబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఫోరం మండల ప్రధాన కార్యదర్శి గాదె రాజు మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, సతీశ్, లక్ష్మయ్య, జాఫర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలను జయప్రదం చేయండి'

దుగ్గొండి : ఈనెల 29, 30 తేదీల్లో నర్సంపేటలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్య సమ్మయ్య కోరారు. మహాసభలను పురస్కరించుకుని మండలంలోని నాచినపల్లిలో అమరవీరుడు బత్తిని సమ్మయ్య స్తూపానికి సోమవారం నివాళులర్పించారు. అనంతరం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడారు. ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. బూర్జువా పార్టీలు ప్రజావ్యతిరేకమని తెలిపారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోరాటాలు నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోరబోయిన కుమారస్వామి, జిల్లా శ్రీధర్, ముంజాల సాయిలు, పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, బొళ్ల శ్రీకాంత్, పొన్నం రాజు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి సతీమణి వెంకటలక్ష్మి సోమవారం గుండెపోటుతో మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించి రామచంద్రారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మధు, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.